ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తే మరింత అభివృద్ధి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత


ఎమ్మెల్యే అనంత రోడ్‌షోకు హాజరైన ప్రజలు, కార్యకర్తలు

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- రాజీవ్‌కాలనీలో జోరుగా ప్రచారం

అనంతపురం కార్పొరేషన్: నగరానికి దీటుగా రాజీవ్‌కాలనీ, ఏ.నారాయణపురం, రుద్రంపేట, అనంతపురం రూరల్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి చేశాం. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేస్తే అనంతపురం నియోజకవర్గంలో మరింత అభివృద్ధి కొనసాగుతుందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం అనంతపురం నియోజకవర్గ పరిధిలోని రాజీవ్‌కాలనీ పంచాయితీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రోడ్ షోలో ఎమ్మెల్యే అనంతకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పూలమాల, శాలువాలతో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగు పంచాయితీల్లో రూ.125 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టేల చర్యలు తీసుకున్నామన్నారు. రాజీవ్ కాలనీలో సరైన రోడ్లు లేవని, డ్రైనేజీలు లేవని, కానీ నేడు రాజీవ్ కాలనీలో వచ్చిన మార్పు గురించి మీ అందరికీ తెలుసన్నారు. టీడీపీ హయాంలో రాజీవ్ కాలనీ బ్రిడ్జ్ కూడా పూర్తి చేయలేదన్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించడం వల్లే ఇంత అభివృద్ధి సాధ్యపడిందన్నారు. ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు కావాలంటే ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉండాలన్నారు.

పంచాయతీలకు పీఏబీఆర్ నీరు

ఈ నాలుగు పంచాయతీలకు పీఏబీఆర్ నీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే పైప్‌లైన్ పనులు శరవేగంగా సాగుతున్న విషయాన్ని ప్రజలకు గుర్తు చేశారు. మరో ఏడు నెలల్లో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతపురం నియోజకవర్గంలో 27 వేల మందికి ఇళ్ల పట్టాలను అందించామన్నారు. రాజీవ్ కాలనీలోని 600 మందికి కొత్తగా పట్టాలు ఇచ్చినట్లు వెల్లడించారు.

టీడీపీతో ముస్లింల రిజర్వేషన్‌కు ఎసరు

బీజేపీ, జనసేనతో కలసి ఎన్నికల్లో బరిలో దిగుతున్న టీడీపీ అధికారంలోకి వస్తే మాత్రం ముస్లింల 4 శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తారన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉంటేనే రిజర్వేషన్లు కొనసాగుతాయన్నారు. ఇంటి వద్దకే వచ్చి పథకాలు అందించే వలంటీర్లపై టీడీపీ కక్ష కట్టిందన్నారు. మళ్లీ ఇంటింటికీ వలంటీర్లు రావాలంటే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని తెలిపారు. దేశమంతా వలంటీర్ల సేవలను ప్రశంసిస్తుంటే చంద్రబాబు వంటి నాయకులు మగవాళ్లు ఇళ్లలో లేని సమయంలో తలుపులు తడతారని వలంటీర్లను అవహేళన చేశారని గుర్తు చేశబూరు. సంక్షేమ పథకాల లబ్ధి ప్రజలకు అందకుండా ఎన్నికల కమిషన్ అడ్డుకోవడం దారుణమన్నారు. వ్యవస్థలను చేతుల్లో పెట్టుకుని డిక్టేటర్‌గా మోదీ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు కారణంగానే ఈ రోజు సంక్షేమ పథకాల లబ్ధి ప్రజలకు అందలేదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మతతత్వ పార్టీ బీజేపీతో జతకట్టి సీఎం పీఠం నుంచి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గద్దె దించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు ప్రజలకేం చేయలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు వివిధ పథకాల ద్వారా నేరుగా వారి ఖాతాల్లో రూ.2,70 లక్షల కోట్లను జమ చేయడం జరిగిందన్నారు. అన్ని పథకాలు కొనసాగాలంటే సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉండాలని ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకర్ నారాయణకు ఓటు వేసి గెలిపించాలన్నారు.

కోవిడ్‌లో ప్రాణాలను లెక్కచేయలేదు

కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో తన వయసు 65 ఏళ్లు అని, ఇప్పుడు 68 ఏళ్లు అని ఎమ్మెల్యే అనంత అన్నారు. కోవిడ్ సమయంలో అనంతపురం ప్రజల సంక్షేమం కోసం, వారిలో మనోధైర్యం నింపడం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఆస్పత్రులకు వెళ్లి బాధితులకు అండగా నిలిచామన్నారు. కార్యక్రమంలో రాజీవ్ కాలనీ సర్పంచ్ ఆశాబీ, వైఎస్సార్‌సీపీ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, రూరల్ కన్వీనర్ హుస్సేన్, ఎంపీటీసీ సంధ్య, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు శివబాల, నాయకులు అంజి, మారెన్న, రహీం, పసులూరు ఓబులేసు, మాజీ ఎంపీటీసీ లక్ష్మీనరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ గోరంట్ల మాధవ్


ఆత్మకూరులో ఎన్నికల ప్రచారానికి హాజరైన ప్రజలు, కార్యకర్తలు

- చంద్రబాబు హామీలు నమ్మి మోసపోవద్దు
- వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే మరింత అభివృద్ధి
- తాగు, సాగు నీరిచ్చాం
- ప్రచారంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, ఎంపీ మాధవ్

ఆత్మకూరు: దశాబ్దాలుగా నియోజకవర్గంలో ప్రజలు నీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పరిటాల సునీత మంత్రిగా పని చేసినా ప్రజలకు ఏనాడు మంచి చేయలేదు. దోచుకోవడం దాచుకోవడం తప్ప అభివృద్ధి మరచిపోయి రూ.వేల కోట్లు దోచుకున్నారని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అన్నారు. పరిటాల సునీతది రాజరికపు పాలన అయితే.. మీ ప్రకాష్‌రెడ్డిది ప్రజా పరిపాలన అని తెలిపారు. దశాబ్దాలుగా ఉన్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరులో ఎంపీ గొరంట్ల మాధవ్‌తో కలసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి ప్రజలు క్రేన్ ద్వారా గజమాలలు వేశారు. టపాసులు కాలుస్తూ, పూల చల్లుతూ మహిళలు హారతులు ఇస్తూ ప్రకాష్‌రెడ్డికి బ్రహ్మరథం పట్టారు.

పథకాలను చంద్రబాబు అడ్డుకున్నారు

ప్రజలకు అందాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా ఇలా ప్రజలకు అందాల్సిన పథకాల సొమ్మును అందకుండా చంద్రబాబు ఎన్నికల కమిషన్ ద్వారా కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని ఆరోపించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ఎంత మంది కలసినా వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. పరిటాల సునీత ఒక్కసారి ఓడిపోతేనే ధర్మవరంలో ఇళ్లు కట్టుకుని టికెట్ కోసం అక్కడ ప్రయత్నించారని తెలిపారు. కాని మీ ప్రకాష్ రెడ్డి లోకల్ రెండు సార్లు ఓడిపోయినా ప్రజల్లోనే ఉండి ప్రజాసేవ చేసినట్లు గుర్తు చేశారు. అమ్మ డెయిరీ ద్వారా ఎంతో మంది మహిళలకు ఉపాధి కల్పించామన్నారు. ఉచిత బోర్లు , సోలార్ ప్రాజెక్టులు, పేరూరు డ్యాంకు నీరు, వేల ఇళ్లు, గార్మెంట్ పరిశ్రమకు శ్రీకారం చుట్టామని వెల్లడించారు. రిజర్వాయర్ల నిర్మాణాలకు శ్రీకారం ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. మంత్రిగా ఉన్న సునీత చెప్పుకోవడానికి ఏ ఒక్క అభివృద్ధి పని కూడా లేదని విమర్శించారు. ఆత్మకూరు చెరువు గురించి మాట్లాడుతున్న సునీత తన సొంత మండలంలో పేరూరు డ్యాంకు నీరు ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన నెలలోనే ఆత్మకూరు చెరువు కట్ట పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందాలన్నా, నియోజకవర్గం అభివృద్ధి చెందాలన్నా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, ఎంపీపీ హేమలత, వైస్ ఎంపీపీ నీలిమ, విజయ్, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వాసుదేవ రెడ్డి మధు, వాసుదేవరెడ్డి, వన్నూరప్ప, పార్వతమ్మ కాయగూరల ముత్యాలన్న, వెంకట్రాముడు, నాగరాజు, మల్లన్న, సద్దికూటి శివారెడ్డి, ఫణిరెడ్డి, సుధాకర్ రెడ్డి, రామాంజి, బాలస్వామిరెడ్డి, అతిక్‌రెడ్డి, బాలపాతన్న, లక్ష్మీరెడ్డి, రుషిరెడ్డి, నరసింహ, పోతన్న, రమేష్, చెన్నారెడ్డి, జయరామిరెడ్డి, నాగభూషణం రెడ్డి, వెంకటేష్, విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆత్మకూరులో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి గజమాలతో సత్కారం

క్లుప్తంగా

ఎమ్మెల్యే అనంతను గెలిపించండి


నవోదయ కాలనీలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కుటుంబీకులు

అనంతపురం కార్పొరేషన్: ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం నగరంలోని నవోదయ కాలనీలో విస్తృత ప్రచారం నిర్వహించారు. గత ప్రభుత్వం కంటే భిన్నంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకర నారాయణను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు అనంత మాలతి, అనంత సువర్ణ, అనంత నవ్యత, అనంత మేఘన, అనంత లిఖిత్‌రెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డివిజన్లలో వైఎస్సార్‌సీపీ భారీ ర్యాలీ


ప్రజలకు అభివాదం చేస్తున్న పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం 35, 36 డివిజన్లలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయనతో పాటు స్థానిక నాయకులు, ప్రజలు కాలినడకన ఆ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో కాలినడకన ప్రజలకు ఓటు అభ్యర్థించారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకర నారాయణను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికలకు సంబంధించి పార్టీ నగర కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, లోక్‌నాథ్ రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాసులు, నాయీబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు నరసింహులు, నాయకులు విజయభాస్కర్ రెడ్డి, నాగేంద్ర రెడ్డి, నాగరాజు రెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభంపై నుంచి పడి వ్యక్తి మృతి

ఆత్మకూరు: విద్యుత్ స్తంభంపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఆత్మకూరు మండలం వడ్డుపల్లికి చెందిన ఆదినారాయణరెడ్డి (50) వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు మరమ్మతు పనుల్లోనూ పాలుపంచుకునేవాడు. శనివారం ఉదయం ఆత్మకూరు వద్ద విద్యుత్ స్తంభంపై ఎక్కి సర్వీస్ లైన్ లాగుతుండగా కరెంట్ ప్రసరించడంతో షాక్ గురై కిందపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

చివరి రోజు ప్రచార హోరు

కనగానపల్లి: సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం ముగిసింది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల కాగా, ఆ రోజు నుంచి అన్ని రాజకీయ పార్టీలు ప్రచారాన్ని ప్రారంభించాయి. రాప్తాడు నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో సుమారు 25 రోజుల పాటు ఎన్నికల ప్రచారం హోరెత్తింది. ప్రధాన పార్టీలైన వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థులతో పాటు కాంగ్రెస్, కొందరు స్వతంత్ర అభ్యర్థులు కూడా ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. చివరి రోజున కూడా నియోజక వర్గంలో పలుచోట్ల అభ్యర్థులు జోరుగా చేశారు. మండలంలోని ముక్తాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్తలు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తరఫున జోరుగా ప్రచారం నిర్వహించారు. స్థానిక పార్టీ నాయకులతో కలసి గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో తిరుగుతూ వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి రాప్తాడు ఎమ్మెల్యేగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, హిందూపురం ఎంపీగా శాంతమ్మ గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, వెంటనారాయణరెడ్డి, ఓబిలేసు, లక్ష్మినారాయణరెడ్డి, సర్పంచ్ నారాయణ, మాజీ సర్పంచ్‌లు సూర్యశేఖర్‌రెడ్డి, రామక్రిష్ణ, సుబ్బిరెడ్డి, మూర్తీ, నాగిరెడ్డి, గోపాల్ రెడ్డి, పలువురు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.


ముక్తాపురంలో వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరుతున్న పార్టీ మహిళా కార్యకర్తలు

సీఎం జగన్‌కు ఓటేస్తేనే సంక్షేమం

రాప్తాడు: చంద్రబాబుకు ఓటేస్తే ప్రజలను పీడించుకు తినే జన్మభూమి కమిటీలు వస్తాయి. జగనన్నకు ఓటేస్తే గడప వద్దకు సంక్షేమ పథకాలు అందించే వలంటీర్లు వస్తారని వైఎస్సార్ సీపీ సీనియర్ మహిళ నాయకురాళ్లు తోపుదుర్తి శైలజా రెడ్డి, గంగుల భానుమతి అన్నారు. రాప్తాడు చెరువులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. శనివారం మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతితో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజలను మోసం చేయడం, అబద్దాలు చెప్పడం తప్ప ఏ ఒక్క పథకమైనా అందరికీ ఇచ్చారా అని ప్రశ్నించారు. ప్రజలదరూ చంద్రబాబు గతంలో చేసిన మోసాలను గుర్తుచుకోవాలని చెప్పారు. ఓటర్లందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి సుపరిపాలన అందిస్తున్న జగనన్న రుణం తీర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ రామాంజినేయులు, మండల కన్వీనర్ శేఖర్, మాజీ సర్పంచు సావిత్రి, బీసీ సెల్ నాయకులు పసుపుల ఆది, వైఎస్సార్ సీపీ నాయకులు సాకే చంద్ర, జయన్న, చిరుతల నాగేంద్ర, రవి, యర్రప రెడ్డి, అభి తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి కూలీలను ఓటు అడుగుతున్న తోపుదుర్తి శైలజా రెడ్డి

48వ డివిజన్‌లో ప్రచారం


బ్యాలెట్ నమూనా చూపుతున్న మేయర్

అనంతపురం కార్పొరేషన్: సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్ సీపీ విధానమని మేయర్ వసీం పేర్కొన్నారు. శనివారం నగరంలోని 48వ డివిజన్‌లో మేయర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకర్ నారాయణకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అనంతపురం నగరంలోనే రూ.800 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. సచివాలయ-వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమాన్ని ఇంటి వద్దకే తీసుకువచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉంటేనే సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీనివాసులు, అనిల్‌కుమార్ రెడ్డి నాయకులు వెంకటేష్, రంగా సుధాకర్, మధు, సురేష్, ప్రసన్న లక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలంటే పవన్ కళ్యాణ్‌కు ఎందుకంత కక్ష?

అనంతపురం కార్పొరేషన్: ముస్లిం మైనార్టీలకు రిజర్వేషన్ అవసరం లేదంటూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాట్లాడుతున్నారని, అసలు ముస్లింలంటే ఆయనకు ఎందుకంత కక్ష అంటూ అనంతపురం నగర మేయర్ వసీం ప్రశ్నించారు. శనివారం నగరంలోని తన వ్యక్తిగత కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీ కూటమిగా ఏర్పడి మైనార్టీలను మోసం చేయాలని కుట్ర చేస్తున్నయని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావించి ప్రతి ఒక్క హామీనీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని గుర్తు చేశారు. 2014 ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబు 600 హామీలను ఇచ్చి ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ఇప్పుడు కూడా సూపర్ సిక్స్ పేరుతో మరోసారి ప్రజలను దగా చేసేందుకు ముందుకు వచ్చారని మండిపడ్డారు.

రామగిరికి పూర్వ వైభవం తీసుకొస్తాం

- సోలార్‌ప్లాంట్, బంగారు గనుల ప్రారంభంతో వేల మందికి ఉపాధి
- ఈ ఎన్నికల్లో ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
- జాతరలా పేరూరులో ఎన్నికల సభ

రామగిరి: రామగిరిలో బంగారు గనులు తెరిపించి, పూర్వవైభవం తీసుకొస్తామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం మండలంలోని పేరూరు బస్టాండ్ వద్ద ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వెనుకబడిన రామగిరి మండలంలో వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. పీఏబీఆర్ నుంచి రూ.110 కోట్లతో ఆత్మకూరు, కనగానపల్లి, రామగిరి మండలాల్లోని 110 గ్రామాలకు తాగు నీరు అందించేందుకు పనులు దాదాపు పూర్తయినట్లు వెల్లడించారు. రామగిరిలో 27 గ్రామాలకు నీరందించడం జరుగుతుందన్నారు. రాప్తాడులో అమ్మడెయిరీ ఏర్పాటు చేశామన్నారు. గార్మెంట్ పరిశ్రమను స్థాపిస్తామని వెల్లడించారు. గొల్లపల్లి నుంచి రూ.49 కోట్లతో గంతిమర్రి, కుంటిమద్ది, పోలేపల్లి గ్రామాలకు తాగు నీరందించి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడుపిస్తామన్నారు. చంద్రబాబు ఇచ్చే మోసపూరిత హామీలు నమ్మి మోసపోవద్దన్నారు. గత టీడీపీ పాలనలో డ్వాక్రా, రైతుల రుణాలను మాఫీ చేస్తామని చెప్పి.. మోసం చేసిన విషయం మరవొద్దన్నారు. పరిటాల సునీత స్వగ్రామానికి కూతవేటు దూరంలో ఉన్న పీఆర్.కొట్టాల, గ్యాదికుంట రోడ్డు పనులను 30 ఏళ్లుగా పరిటాల కుటుంబం చేయక పోగా ఇతర కాంట్రాక్టర్లు రాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. అభివృద్ధిని అడ్డుకోవడమే వారి అజెండా అన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. మరోమారు తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే గ్రామాల్లోని అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. రాప్తాడులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి గ్రామంలోకి రాగానే నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు, పూలు చల్లుతూ స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ మీనుగ నాగరాజు, జెడ్పీటీసీ నాగార్జున, మండల కన్వీనర్ కక్రా హనుమంతరెడ్డి, సర్పంచులు రాజేష్, సిద్దన్న, చెన్నకేశవరెడ్డి, నరేంద్ర, ఓబిరెడ్డి, రామ్మూర్తి, నాయకులు నసనకోట ముత్యాలప్ప, నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, దాసరి మోహన్, రామాంజనేయులు, ఆదిరెడ్డి, జనార్దన్‌తోపాటు ఎంపీటీసీలు, ఇతరులు పాల్గొన్నారు.


చెన్నేకొత్తపల్లి: మేడాపురం ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


రామగిరి: ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఫ్యాన్ ప్రభంజనాన్ని ఆపలేరు

చెన్నేకొత్తపల్లి: ఈ ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనాన్ని ఆపలేరని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని మేడాపురం గ్రామంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఫ్యాన్ హవా నడుస్తోందన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగుతూ మరిన్ని పథకాలు అందాలంటే వైఎస్ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే సాధ్యమన్నారు. చంద్రబాబు అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేసి అధికారం దక్కించుకొనేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు చెప్పే మాటలను నమ్మరాదని ఓటర్లకు సూచించారు. తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాత రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అంతకుముందు గ్రామస్తులు ఎమ్మెల్యేపై పూల వర్షం కురిపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధికి ఓటు వేద్దాం


ఓటు అభ్యర్థిస్తున్న పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో ఏ నారాయణపురంలో జరిగిన అభివృద్ధికి ఓటు వేద్దామని యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏ నారాయణపురం పంచాయతీలోని రాయల్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకర నారాయణకు ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. పథకాలు యథావిధిగా కొనసాగుతూ మరిన్ని పథకాలు అందాలంటే వైఎస్ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు నాగేంద్ర, మనోజ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, పురుషోత్తం రెడ్డి, పెద్దిరాజు, పోతులయ్య, నాగార్జున, రామాంజుల రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించండి


మాట్లాడుతున్న కాగజ్‌ఘర్ రిజ్వాన్

అనంతపురం కార్పొరేషన్: ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని మైనార్టీలకు జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ పిలుపునిచ్చారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం మైనార్టీల అభ్యున్నతికి రూ.2,200 కోట్లు కేటాయిస్తే.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏకంగా రూ.23వేల కోట్లు ఖర్చు చేసిందని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనే చేతకాక మతతత్వ బీజేపీతో చంద్రబాబు జత కట్టడం ఆయన దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. ముస్లిం మైనార్టీల 4 శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తామంటూ ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా ప్రచారం చేస్తుంటే, దానిపై టీడీపీ, జనసేన నోరుమెదపడం లేదన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శి కట్టబడి తనీషా, ఆజాద్‌నగర్ ఇషాక్ పాల్గొన్నారు.

ప్రచారంలో అంగన్‌వాడీ ఆయా


టీడీపీ తరఫున ప్రచారం చేస్తున్న అంగన్‌వాడీ ఆయా చంద్రమ్మ

ఆత్మకూరు: మండలంలోని మదిగుబ్బ తండా గ్రామానికి చెందిన అంగన్‌వాడీ ఆయా చంద్రమ్మ నిబంధనలు ఉల్లంఘించి ఎన్నికల ప్రచారంలో పాల్గొంది. టీడీపీ తరఫున ప్రచారం చేస్తున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఓ ప్రభుత్వ ఉద్యోగి తరహాలో ఉన్న ఆమె పార్టీ తరఫున ప్రచారం ఎలా చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ఐసీడీఎస్ అధికారులను సంప్రదించగా.. తమకు తెలిసిన విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.